# బస్తీటక్కరు

మాయ అంటే ఎరగని వూరుపెద్ద అచ్చయ్య నగరంలోవున్న కొడుకుని చూద్దామని బయలుదేర్తుండగా లైబ్రీ గుమాస్తా "అచ్చయ్య బాబాయ్! పట్నం పోతున్నావు. జాగ్రత్తసుమా, టక్కర్ వెధవలు విచ్చలవిడిగా వుంటార"న్నాడు. "వాళ్ళ మొహం" అన్నాడు అచ్చయ్య. పూర్వకాలం సిల్కు కోటు, వెండి పొన్నుకర్ర ధరించి పట్నం వచ్చాడు.

కొడుకుండే యింటికి వస్తుండగా ఇద్దరు వెంటవస్తున్నారు మామూలు ప్రయాణికులమాదిరి. ఒకడు అచ్చయ్య భుజానికి మంచి డాష్ యిచ్చి పోతున్నాడు. అచ్చయ్యకి వొళ్ళుమండి, "ఎవ్వడ్రా గుడ్డిగాడిదలా రాసుకుపోతాడు" అన్నాడు. ముందువాడు "నోరుముయ్" అని పోతున్నాడు. రెండోవాడు అచ్చయ్య మీద సానుభూతి పూర్వకంగా "సార్, ఆ రాస్కెలుపని పడ్తా, తమ కర్రయివ్వండొకమారు" అనగానే అచ్చయ్యకి ఉద్రేకం సంతోషంగా మారి కర్ర యిచ్చి "వెధవని నాల్గు వెయ్యండ"న్నాడు. ముందువాడు ప్రక్కసందులోకి దౌడు తీశాడు. రెండోవాడు కర్ర పుచ్చుకుని చరచరా వాడి వెనకాలే మాయమయ్యాడు. వెండిపొన్నుకర్ర టక్కరైపోయింది!

('చిత్రగుప్త', కార్డుకథ - 1-1-1951)